ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం.. పునాదులు దాటేనా!

మోడల్ గ్రామంలో నిర్మాణ పనులు ప్రశ్నార్థకం ◆ సుల్తాన్‌పల్లిలో అనుమతి పత్రాలిచ్చి నెల దాటిన వైనం ◆ ప్రారంభం కాని నిర్మాణ పనులతో పరేషాన్ ◆ నిర్మించుకునేందుకు ఆసక్తి చూపని లబ్ధిదారులు



సుల్తాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి పునాదులు తీసేందుకు చేసిన మార్కింగ్

శంషాబాద్ రూరల్: పేదల సొంతింటి కల నెరవేరే బృహత్తర పథకానికి పలు అంశాలు మోకాలడ్డుతున్నాయి. ప్రధానంగా ఆర్థిక సమస్యలే పథకం ముందుకు వెళ్లనీయడం లేదు. నిరుపేదలకు సొంత గూడును కల్పించాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చేపట్టింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం వివిధ కారణాలతో పునాదుల స్థాయిని దాటడం లేదు.

- గూడు లేని నిరు పేదలకు ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 5 లక్షలు ఆర్థిక సాయం అందించనుంది. ఇందులో భాగంగా లబ్ధిదారులను గుర్తించి ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. మంజూరు పత్రాలు అందిన నెల లోపు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలి. అయితే లబ్ధిదారుల నుంచి ఆశించిన స్థాయిలో స్పందన లేనందున సదరు నిర్మాణాలు ప్రారంభం కాలేదు.
- మండలానికి ఒక గ్రామాన్ని మోడల్‌గా ఎంపిక చేసి ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేపట్టింది. ఇందుకోసం శంషాబాద్ మండలంలో సుల్తాన్‌పల్లి పంచాయతీని మోడల్ గ్రామంగా ఎంపిక చేశారు.
- జనవరి 26న లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం మంజూరు పత్రాలను సైతం అందజేశారు. అంతేకాకుండా లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంపై అధికారులు అవగాహన కూడా కల్పించారు.
- సుల్తాన్‌పల్లి గ్రామంలో ఎంపిక చేసిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఇందుకు పలు కారణాలు కూడా వారు చెబుతున్నారు. ఇళ్ల నిర్మాణాల కోసం త్వరగా పునాదులు తీసి పనులు చేపట్టాలని అధికారులు పేర్కొంటుండగా.. తీరిగ్గా పనులు ప్రారంభిస్తామని లబ్ధిదారులు పేర్కొంటున్నారు.
- ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సాయం పలు దఫాలుగా చెల్లిస్తారు. దీంతో లబ్ధిదారులు ముందుగా వారి సొంత డబ్బులు వెచ్చించాల్సి రావడం కూడా ప్రధాన కారణంగా చెప్పుకోవచ్చు.
- మరో వైపు ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో మాత్రమే చేపట్టాలి. ఇందులో పడక గదితో పాటు వంట గది, మరుగుదొడ్డి తప్పనిసరి. చిన్న పాటి విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం చేసుకోవడానికి ఇక్కడ ప్రస్తుతం లబ్ధిదారులు ఆసక్తిగా లేనట్లు కనిపిస్తోంది.
- కనీసం వంద గజాల విస్తీర్ణంలో ఇల్లు నిర్మిస్తేనే అన్ని రకాలుగా సౌకర్యవంతంగా ఉంటుందని లబ్ధిదారులు భావిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 44 గజాల విస్తీర్ణంలో మాత్రమే ఇంటి నిర్మాణం చేపట్టాలి.

ముంచుకొస్తున్న గడువు...

ఇందిరమ్మ ఇళ్ల బేస్‌మెంట్ పనులను ఈ నెల 15 వరకు పూర్తి చేయాల్సిందిగా కలెక్టర్ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో సుల్తాన్‌పల్లిలో కొంత మంది మాత్రమే రెండు రోజుల కిందట నిర్మాణాల కోసం మార్కింగ్ చేశారు. పది రోజుల్లో పునాదులు తీసి బేస్‌మెంట్ పనులు పూర్తి చేయాలంటే కష్టమనే చెప్పుకోవచ్చు.

- నాలుగు దఫాలుగా డబ్బులు చెల్లిస్తారు. పునాదులు పూర్తి చేసిన తర్వాత రూ. లక్ష, పైకప్పు గోడల నిర్మాణం వరకు రూ. లక్ష, పైకప్పు వేసిన తర్వాత రూ. 2 లక్షలు, పూర్తిగా ఇంటి నిర్మాణం తర్వాత రూ. లక్ష లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.

మాకు వద్దంటూ...

సుల్తాన్‌పల్లిలో గుర్తించిన లబ్ధిదారుల్లో 8 మంది ప్రస్తుతం మేము ఇళ్లు కట్టుకోలేమని, మాకు ఈ పథకం వద్దంటూ రాత పూర్వకంగా అధికారులకు స్పష్టం చేశారు. ఇక్కడ 41 మంది లబ్ధిదారులను గుర్తించి అనుమతులు జారీ చేశారు. వీరిలో 39 మందికి ఖాళీ స్థలాలు ఉండగా.. మరో ఇద్దరు పాత ఇళ్లను కూల్చి అదే స్థలంలో నిర్మాణం చేస్తామని పేర్కొన్నారు. పది మంది వరకు ఇళ్ల నిర్మాణం కోసం ముగ్గు వేశారు. ఇలా కొందరు ఇళ్ల నిర్మాణానికి చొరవ చూపితే మరికొందరు వెనక్కు తగ్గుతుండటంపై పథకం విజయవంతం అయ్యేనా అనే అంశంలో పలు అనుమానాలు తలెత్తుతున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి



ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి. సకాలంలో నిర్మాణాలు పూర్తి చేస్తే ఆర్థిక సాయం త్వరగా మంజూరు అవుతుంది. సుల్తాన్‌పల్లిలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు పది మందికి ఒకరు చొప్పున పంచాయతీ కార్యదర్శులను నియమించి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. వీరికి నిర్మాణ తీరుపై అవగాహన కూడా కల్పించాం. ఈ నెల 15వ తేదీ లోపు బేస్‌మెంట్ పనులు పూర్తి చేస్తే మొదటి దఫా ఆర్థిక సాయం అందుతుంది.

- మున్షీ, ఎంపీడీఓ, శంషాబాద్

మహిళా సాధికారతకు ప్రభుత్వం ప్రాధాన్యం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



మహిళా దినోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తదితరులు

శంషాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్ద పీట వేస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని వైఎన్నార్ గార్డెన్‌లో సిరీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనేక రంగాల్లో మహిళలు అద్భుతంగా రాణిస్తున్నారన్నారు. మహిళల పట్ల అక్కడక్కడ జరుగుతున్న సంఘటనలు బాధాకరంగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుష్మ, మాజీ వైస్ చైర్మన్ బండిగోపాల్, మాజీ సర్పంచ్ ఆర్.గణేష్‌గుప్తా, మాజీ నార్సింగి ఏఎంసీ చైర్మన్ డి.వెంకటేష్‌గౌడ్, సిరి సంస్థ ప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

పీఅండ్‌టీ కాలనీలో అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

బండ్లగూడ: అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని నేలమట్టం చేస్తామని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర హెచ్చరించారు. కార్పొరేషన్ పరిధిలోని పీఅండ్‌టీ కాలనీలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను బుధవారం మున్సిపల్, టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా సెట్ బ్యాక్స్‌లు లేకుండా అడ్డగోలుగా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నామన్నాని కమిషనర్ శరత్‌చంద్ర స్పష్టం చేశారు. అక్రమ కట్టడాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని వాటిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. ప్రజలందరూ నిబంధనలకు అనుగుణంగా తమ నిర్మాణాలను చేపట్టుకోవాలని సూచించారు. నిర్మాణాలు చేపట్టే సమయంలో పూర్తి అనుమతులు తీసుకోవాలని... ఆ తర్వాతే నిర్మాణాలు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితంలో పదో తరగతి ఎంతో ముఖ్యం



గోల్కొండ: విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో ముఖ్యమని గోల్కొండ ఉర్దూ మోడల్ స్కూల్ అకాడమిక్ హెడ్ యాస్మిన్ బేగం అన్నారు. బుధవారం గోల్కొండ నయాఖీలాలోని ఉర్దూ మోడల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల ఫేర్‌వేల్ డే జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదో తరగతి జ్ఞాపకాలు జీవితాంతం ఉంటాయన్నారు. పదో తరగతి పరీక్ష రాయడంపై విద్యార్థులు తమపై ఒత్తిడి పెంచుకోవద్దు అన్నారు. పరీక్షలంటే భయపడే వారు ర్యాంకులు సాధించలేరని నిర్భయంగా పరీక్షలు రాసే వారే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పటేల్‌నగర్‌లో అగ్నిప్రమాదం

గన్‌ఫౌండ్రీ: గాంధీభవన్ వద్ద ఉన్న పటేల్‌నగర్‌లో బుధవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాచ్ మెకానిక్ షెడ్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బాచ్ మోటార్స్ మెకానిక్ షెడ్‌లో డీజిల్, పెట్రోల్‌తో బాచ్ పంప్ రిపేరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా బుధవారం సైతం పలు వాహనాలకు రిపేర్ చేస్తున్న సమయంలో మెకానిక్ షెడ్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. జన నివాసాల మధ్య ఇటువంటి దుకాణాలు ఉండటం శ్రేయస్కరం కాదని పలువురు కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: విద్యుత్ సంబంధ మరమ్మతు పనులు, సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులు చేపడుతున్నందున గురువారం పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు నార్సింగి ఏఈ మణికంఠ తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు మంచిరేవుల గ్రామం, మంత్రి విల్లాస్, గ్రీన్‌లాండ్, జైహింద్ కాలనీలు, నార్సింగి గ్రామంలో విద్యుత్ ఉండదని వివరించారు.

రక్తదానం ఎంతో అవసరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ప్రిన్సిపాల్

మణికొండ: ప్రమాదాల బారిన పడిన వారికి రక్తం లభించక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, అలాంటి వారిని ఆదుకునేందుకు ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయాలని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ జూబ్లీహిల్స్ వారి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... ఆరు నెలలకు ఒక సారి రక్తదానం చేయటం వలన రక్తం ఉత్పత్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు విజయలక్ష్మి, అరుణ, అధ్యాపకులు డాక్టర్ ఎం.రవిచందర్, రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో ఆర్.ఎస్.బ్రదర్స్ షోరూమ్ ప్రారంభం

సందడి చేసిన సినీనటి నిధి అగర్వాల్



అత్తాపూర్: అత్తాపూర్‌లో ఆర్.ఎస్.బ్రదర్స్ నూతన షోరూమ్ బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. టాలీవుడ్ నటి నిధి అగర్వాల్ ముఖ్య అతిథిగా హాజరై షోరూమ్‌ను ప్రారంభించారు. ఆర్ఎస్ బ్రదర్స్ రిటైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు పి.వెంకటేశ్వర్లు, ఎస్.రాజమౌళి, టి.ప్రసాదరావులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అన్ని వర్గాల ప్రజలకు సరమైన ధరల్లో నాణ్యమైన వస్త్రాలు ఇక్కడ లభిస్తాయన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంతో తాము ముందుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో షోరూమ్ నిర్వాహకులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

కులగణన చరిత్రాత్మకం

మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

శంషాబాద్: కులగణన చేయడం చరిత్రాత్మక విషయమని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ముదిరాజ్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో శంషాబాద్‌లోని ఎమ్మెస్ గార్డెన్‌లో బుధవారం ముదిరాజ్ కృతజ్ఞత మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కులగణతో ముదిరాజ్‌ల సంఖ్య స్పష్టమైందన్నారు. భవిష్యత్తులో రాజకీయ రంగంలో ముదిరాజ్‌లకు అపారమైన అవకాశాలు దక్కుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేపట్టిన కులగణన ముదిరాజ్‌ల సంఖ్యను బహిర్గత పరిచిందని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అన్నారు. ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రభుత్వం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లకు విస్తృత అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రివర్గంలో కూడా ముదిరాజ్‌ల ప్రాధాన్యం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ రాష్ట్ర, జిల్లా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు మనూలో జాతీయ సదస్సు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10.30 గంటలకు జాతీయ సదస్సు నిర్వహిస్తామని ఆ విభాగం హెడ్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ అజీమ్ తెలిపారు. వికసిత్ భారత్- ఎస్‌డీజీల సందర్భంగా సమకాలీన వ్యాపార పద్ధతులపై రెండు రోజుల జాతీయ సదస్సులో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ శ్రీనివాసమూర్తి, రాష్ట్ర ఎంఎస్ఎంఈ మాజీ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ అబ్దుల్ ఖుద్దూస్, వీసీ ఐనుల్ హసన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్ పాల్గొంటారని చెప్పారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం

అఫ్జల్‌గంజ్: ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు ఇన్‌ఫెక్షన్ల నివారణలో పూర్తి స్థాయిలో విజయం సాధించడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని ఉస్మానియా జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్ అన్నారు. బుధవారం ఆసుపత్రిలోని సెమినార్ హాల్‌లో ఆసుపత్రి ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీ సమావేశం నిర్వహించారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో రోగులకు ఇన్‌ఫెక్షన్ వ్యాపించకుండా నియంత్రించడం, నివారణ చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. హైక్వాలిటీ పేషంట్ కేర్, పరిసరాలు, వార్డుల్లో పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యమిస్తున్నామన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



గోల్కొండ: ప్రీ ప్రైమరీ చదువుతున్న అమ్మాయిలు కిచెన్‌లో తాము అద్భుతాలు సృష్టిస్తామని చెబుతున్నారు. గ్లెండల్ అకాడమీ ప్రీప్రైమరీ విద్యార్థులకు జ్యూస్, బ్రెడ్ రోల్ తయారీల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని జ్యూస్‌లు, బ్రెడ్ రోల్స్ తయారు చేసి అందరిని అబ్బురపరిచారు. బొమ్మల దేవిక పోటీల్లో అగ్రస్థానంలో నిలిచింది. ఈ కార్యక్రమంలో టీచర్లు సబియా, మహేశ్వరి, అత్రియ తదితరులున్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించే విషయంలో సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో బుధవారం జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రజలు పలు సమస్యలతో సతమతం అవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లన్నీ గుంతలమయమైనా సకాలంలో మరమ్మతు చేయనందున పాదచారులు, వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీలైనంత త్వరగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించి, రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలన్నారు. జలమండలి అధికారులు రేణుక, వినయ్, జీహెచ్ఎంసీ ఏఈ నర్సింహ్మా మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, నాయకులు జోగి రవి, శ్రీకాంత్‌రెడ్డి, ప్రభుదాస్, పరుషోత్తం, రాకేష్, శ్రీకాంత్‌రెడ్డి, పాండుయాదవ్, ఎ.శంకర్, మాలతి, ప్రసాద్, సిద్ధప్ప, రాజు, రఘురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం: సీపీఎం



వెంకటేశ్వర కాలనీలో పర్యటిస్తున్న సీపీఎం నేతలు

మైలార్‌దేవ్‌పల్లి: అలవి కాని హామీలిచ్చి తెలంగాణ రాష్ట్ర ప్రజానీకాన్ని కాంగ్రెస్ పాలకులు మోసం చేశారని సీపీఎం రాజేంద్రనగర్ మండల కార్యదర్శి జాజాల రుద్రకుమార్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు ఏవిధంగా చేస్తోంది... బస్తీలలో నెలకొన్న సమస్యలపై ఇంటింటి పర్యటన కార్యక్రమాన్ని చేపట్టారు. రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యుడు జి.ఎం.గట్టయ్య అధ్యక్షతన మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వెంకటేశ్వర కాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీలలో బుధవారం పార్టీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా రుద్రకుమార్ మాట్లాడుతూ.. హామీల అమలులో పాలకులు విఫలం అయ్యారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఎం రాజేంద్రనగర్ మండల కమిటీ సభ్యులు మనమ్మ, జి.ఎం.కురుమయ్య, ఎన్.జంగయ్య, భాస్కర్, జి.ఎం.చైతన్య, మొగులయ్య, లక్ష్మణ్‌నాయక్, చెన్నయ్య, లక్ష్మణ్, వెంకటస్వామి, తిరుమల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

శంషాబాద్ రూరల్: ఔటర్ రింగు రోడ్డు ఫెన్సింగ్ రాడ్‌కు ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి సమాచారం మేరకు... తొండుపల్లి శివారులో ఔటర్ రింగు రోడ్డు కింద రైల్వే ట్రాక్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి ఉరి వేసుకున్నట్లు ఈ నెల 3న రాత్రి స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి(25)కి సంబంధించి ఎలాంటి ఆచూకీ లభించలేదు. మృతుడి ఒంటిపై నీలిరంగు టీ షర్టు, నలుపు రంగు ప్యాంటు ఉన్నాయి. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ముగిసిన 'ఫెడరేషన్' నామినేషన్ల పర్వం

మణికొండ: ఆల్ కాలనీస్ రెసిడెన్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఫెడరేషన్ నామినేషన్ల పర్వం బుధవారం రాత్రితో ముగిసింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని కాలనీల ప్రతినిధులు ఫెడరేషన్‌లో పోటీ పడతారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంగళ, బుధవారాల్లో నామినేషన్లు దాఖలు చేసే ప్రక్రియ కొనసాగింది. అందులో భాగంగా కొన్ని పదవులకు పోటీ పదవులకన్నా తక్కువగా ఉండగా, మరికొన్ని పదవులకు మాత్రం ఎక్కువ మంది సభ్యులు నామినేషన్లు దాఖలు చేశారు. అధ్యక్ష స్థానం కోసం నలుగురు నామినేషన్లు దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవులు 5 మాత్రమే ఉండగా ఏడుగురు నామినేషన్లు వేశారని ఎన్నికల అధికారులు ఎం. సత్యనారాయణ, బి.వి.సత్యనారాయణ తెలిపారు. ప్రధాన కార్యదర్శి పదవి ఒకటి ఉండగా దానికి ఒకరే నామినేషన్ వేయటంతో అది ఏకగ్రీవం అవుతుందన్నారు. సంయుక్త కార్యదర్శి పదవులు ఐదు ఉండగా నలుగురు మాత్రమే నామినేషన్లు వేశారన్నారు. అదే తరహాలో కార్యనిర్వాహక కార్యదర్శి స్థానాలు ఏడు ఉండగా నలుగురు మాత్రమే నామినేషన్లు వేశారని వారు వివరించారు. కోశాధికారి పదవి ఒకటి ఉండగా దానికి ఒకరే నామినేషన్ వేయటంతో అదీ ఏకగ్రీవం అవుతుందని, ఉప కోశాధికారి పదవి ఒకటి ఉండగా దానికి ఎవరూ నామినేషన్ వేయలేదన్నారు. గురువారం నామినేషన్ల ఉపసంహరణ ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఉంటుందన్నారు. శుక్రవారం తుది జాబితాను ప్రచురిస్తామని, దాన్ని బట్టి ఎన్నికలు జరుగుతాయా.. ఏకగ్రీవం అవుతాయా అనే విషయం తెలుస్తుందని ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

మెగా ఎంఎస్ఎంఈ క్యాంపులో రుణాల అందజేత



రుణ మంజూరు పత్రాలను అందజేస్తున్న బ్యాంకు అధికారులు

శంషాబాద్ రూరల్: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో చేపట్టిన ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ క్యాంపులతో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహంతో పాటు మేక్ ఇన్ ఇండియాకు నూతన శక్తిని ఇస్తుందని జిల్లా పరిశ్రమల జనరల్ మేనేజర్ ఎం.శ్రీలక్ష్మి అన్నారు. బ్యాంకు సైఫాబాద్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో మండలంలోని ముచ్చింతల్‌లో ఉన్న స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో బుధవారం మెగా ఎంఎస్ఎంఈ ఔట్‌రీచ్ క్యాంపు నిర్వహించారు. ఎంఎస్ఎంఈ ఉత్పాదనలపై బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కల్పించారు. సుమారు రూ. వంద కోట్లకు సంబంధించిన రుణ మంజూరు పత్రాలను 50 మంది ఖాతాదారులకు అందజేశారు. ఎంఎస్ఎంఈ సెక్టార్ రుణాలు దేశంలో 30 శాతం జీడీపీతో దేశానికి వెన్నుముకంగా ఉన్నామని ఎంఎస్ఎంఈ వెర్టికల్ సీఓ ముంబయి జనరల్ మేనేజర్ జి.కె.సుధాకర్‌రావు అన్నారు. వివిధ రకాల ఉత్పత్తుల తయారీ రంగంలో 45 శాతం వాటాతో పాటు దేశంలో 65 శాతంపైగా యువతకు జీవనోపాధి కల్పిస్తుందన్నారు. ఇలాంటి మెగా క్యాంపులను దేశంలోని 157 కేంద్రాల్లో మార్చి 3 నుంచి 7 వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు హైదరాబాద్ జనరల్ మేనేజర్ ఆర్.ఎల్.పట్నాయక్, డీజీఎం సోనాలిక, ఏజీఎంలు రవి, జగదీశ్, లేపాక్షి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటిలో కోతలు విధించొద్దు

● ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్



జలమండలి ఎండీ అశోక్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్, ముబీన్ తదితరులు

గోల్కొండ: ఈ వేసవిలో కార్వాన్ నియోజకవర్గానికి తాగునీటిలో ఎటువంటి కోతలు విధించొద్దని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కలిశారు. కార్వాన్‌లోని పలు డివిజన్లలో తాగునీటి సరఫరాలో ఎన్నో అవాంతరాలు వస్తున్నాయని, ఈ కారణంగా పలు ప్రాంతాల్లో నీరందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. పబ్లిక్ బోర్లు ప్రజలకు అందుబాటులో లేకుండాపోయాయని దీంతో ప్రజలు నల్లాల మీదే ఆధారపడి ఉన్నారన్నారు. జంటనగరాలకు తాగునీరు అందించే జలాశయాలలో నీరు సంవృద్ధిగా ఉన్నదని ప్రభుత్వ ప్రకటనలు వస్తున్నాయని ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలకు సరిపడా తాగునీరు అందించాల్సిన అవసరం ఉందన్నారు. నియోజకవర్గానికి నీరు సరఫరా చేసే రిజర్వాయర్ల అధికారులను అడిగి కార్వాన్ నియోజకవర్గానికి ఎంత నీరు అవసరం అన్న విషయం తెలుసుకొని కోతలు లేకుండా చూస్తానని ఈ సందర్భంగా జలమండలి మేనేజర్ హామీ ఇచ్చారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..

సంక్షేమ పథకాలను అర్హులకు మంజూరు కావడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కౌసర్ అన్నారు. బుధవారం ఆయన టోలిచౌకి మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో వైద్యం నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పేదల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తుందని కార్వాన్ నియోజకవర్గంలో అనేక మంది లబ్ధిపొందారని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ రఫత్ హుస్సేన్ తదితరులున్నారు.